క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి ఎం.సునీత మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. మండలానికి చెందిన 7వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులన్నారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 19వ తేదీ వరకు కస్తూర్బాలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అసిస్టెంట్ కుక్ పోస్టును కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయడం జరుగుతుందన్నారు. వివరాల కోసం 7803405035 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

నియామకం


సమీరకుమార్

పాలకుర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ)మేనేజర్‌గా హనుమకొండ హెడ్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఎ.సమీరకుమార్‌ను నియమిస్తూ ఆ బ్యాంక్ చైర్మన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాలకుర్తి బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్న సింధుజను వరంగల్ జిల్లా దామెర బ్రాంచి మేనేజర్‌గా బదిలీ చేశారు. పాలకుర్తి బ్రాంచ్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ప్రవంతిని జఫర్‌గడ్ బ్రాంచ్‌కు బదిలీ చేయగా, యాదగిరిగుట్ట నుంచి రవళిని పాలకుర్తి బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్‌గా నియమించారు. పాలకుర్తి బ్రాంచ్‌లో అకౌంటెంట్‌గా పని చేస్తున్న రాములు దేవరకొండ బ్రాంచ్‌కు ప్రమోషన్‌పై బదిలీ కాగా హనుమకొండ హెడ్ ఆఫీస్‌లో పనిచేస్తున్న వరప్రసాద్‌ను పాలకుర్తి బ్రాంచ్ అకౌంటెంట్‌గా నియమించారు.

బీజేపీ మండల ప్రధానకార్యదర్శిగా దేవరాజు



పాలకుర్తి టౌన్: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని శాతాపురం గ్రామానికి చెందిన వేల్పుల దేవరాజును నియమిస్తూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి ఆదేశాల మేరకు దేవరాజ్‌ను మండల కార్యదర్శిగా నియమించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

అవార్డుకు ఎంపికైన వాస్విక్ ఫౌండేషన్


బచ్చన్నపేట: ప్రజలకు సేవలు చేసినందులకు గాను వాస్విక్ ఫౌండేషన్ ఇన్‌స్పైరింగ్ యూత్ ఆఫ్ ఇండియా అవార్డుకు ఎంపికైనట్లు ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఫౌండేషన్ ద్వారా చేపట్టిన పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్లకు పుస్తెమట్టెల అందజేత, రక్తదాన, అన్నదానం, ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు, అనాథ వృద్ధామాలకు అందజేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి నేషనల్ హ్యూమన్ వెల్ఫేర్ కౌన్సిల్ వారు ఇన్‌స్పైరింగ్ యూత్ ఆఫ్ ఇండియా అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవార్డు రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో పీరీల సందడి


పీరీలతో భక్తులు

బచ్చన్నపేట/పాలకుర్తిటౌన్: గ్రామాల్లో మొహర్రంను పురస్కరించుకొని మంగళవారం పీరీలను ఊరేగిస్తుండటంతో సందడి వాతావరణం నెలకొంది. వీధుల్లో డప్పు చప్పుళ్లతో పీరీలను తిప్పుతుంటే మహిళలు నీటి బిందెలతో నీళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో దాసరి మధు, బండి కొండయ్య, చిట్యాల ఎల్లయ్య, చిట్యాల మహేష్, జీడి ఉప్పలయ్య, సమ్మన్న, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



నర్మెట: మండల కబడ్డీ అసోసియేషన్ కమిటీ నూతన అధ్యక్షుడిగా ప్రజ్ఞాపురం శ్రీధర్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి తోటకూరి గట్టయ్య అధ్యక్షతన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా తేజావత్ మోహన్, ఉపాధ్యక్షులుగా జాటోత్ సురేశ్, ఇట్టిబోయిన రాజు, సహాయ కార్యదర్శిగా బుర్రా నరేశ్, కోశాధికారిగా నేతావత్ అరుణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు కొర్రా రాకేశ్, బానోత్ సుమన్, మాలోత్ గణేశ్, బానోత్ అశోక్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు వై. కుమార్ గౌడ్, కోశాధికారి ఎదునూరి ఉప్పలయ్య, ప్రభుదాస్, ఆనంద్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోండి


దేవరుప్పుల: ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


బచ్చన్నపేట: పడమటి కేశ్వాపూర్‌లో..


జనగామ రూరల్: ర్యాలీలో టీచర్లు, చిన్నారులు


రఘునాథపల్లి: మాట్లాడుతున్న లావణ్య


స్టేషన్‌ఘన్‌పూర్: చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు

దేవరుప్పుల: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలను చిన్నారులు, తల్లిదండ్రులు వినియోగించుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అమ్మమాట–అంగన్‌వాడీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్న పెద్దమడూర్, కోలుకొండ గ్రామాల్లో చేపట్టిన ర్యాలీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పిల్లలకు ఆరోగ్య వంతమైన జీవితాన్ని అందించడంతో పాటు ఎదుగుదలలో ముఖ్య పాత్ర పోషించే అంగన్‌వాడీ కేంద్రాల్లో వారిని చేర్పించాలన్నారు. గర్భిణులతో పాటు చిన్న పిల్లల అభ్యున్నతికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. డాక్టర్ శ్రీలక్ష్మి, శిరీష, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శ్రీదేవి, అన్వర్ ఉన్నీసా, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన ప్రీస్కూల్ విద్య..

స్టేషన్‌ఘన్‌పూర్: పిల్లలకు నాణ్యమైన ప్రీస్కూల్ విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ ఫ్లోరెన్స్ అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దివ్య, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.విజయ, డి.ఉపేంద్ర, సీహెచ్.మంజుల, పి.రేణుక, వి.పార్వతి, ఎం.రజిత పాల్గొన్నారు.

నమిలిగొండలో..

మండలంలోని నమిలిగొండ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు, తల్లుల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తుందన్నారు. పిల్లలకు పూర్వపఠన, పూర్వ లిఖిత, పూర్వ గణిత నైపుణ్యాలు పెంపొందేలా ఆటపాటల ద్వారా ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జేసు మణి, అంగన్‌వాడీ టీచర్లు బి.రజిత, ఎం.సుజాత, కె.తిరుపతమ్మ, అంగన్‌వాడీ పిల్లలు పాల్గొన్నారు.

గ్రామాల్లో..

జనగామ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ, ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో అమ్మ మాట అంగన్‌వాడీ బాటపై విస్తృతంగా ప్రచారం చేపట్టారు. మరిగడిలో అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని సత్రం కాలనీ, కురుమవాడ, హనుమాన్ వాడ–1,లో ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ రమాదేవి, సూపర్‌వైజర్ పూర్ణిమ, టీచర్లు స్వర్ణలత, శ్రీజయ, ప్రమీల, లక్ష్మి, యాకలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

కొడకండ్లలో..

కొడకండ్ల: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని పంచాయతీల కార్యదర్శులు గంట శ్రీనివాస్, కోట బయ్యన్నలు కోరారు. కొడకండ్ల, పాకాల గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అమ్మమాట–అంగన్‌వాడీ బాట ర్యాలీల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూపరువైజరు సరళ, అంగన్‌వాడీ టీచర్లు మైమూదాబేగం, సరిత, ఉప్పలక్ష్మీ, వినోద, మంజుల, నర్సమ్మ, మాధవి, శ్రీలత, ఎఎన్ఎంలు జ్యోతి, ఏలీషా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పూర్వ ప్రాథమిక విద్య

రఘునాథపల్లి: అంగన్‌వాడీలో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య సూచించారు. అమ్మమాట–అంగన్‌వాడీ బాటలో భాగంగా మండలంలోని నిడిగొండ, తూర్పుగూడెం, పడమటిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పి లక్ష్మికాంతమ్మ, సీహెచ జయలక్ష్మి, యు వీరలక్ష్మి, టి అంజనీబాయ్, అయా స్వర్ణలత పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని రామచంద్రగూడెం, భాంజీపేటలో అమ్మమాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎస్ మంజుల, జి ప్రేమలత, మహేశ్వరి, అండాలు, శ్రీలత, ఆయాలు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో..

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని 1,2,3,4 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ మండల సూపర్ వైజర్ దూలమ్మ, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాలలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

బచ్చన్నపేట: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పడమటికేశ్వాపూర్ గ్రామ అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, ప్రేమలత కోరారు. మంగళవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యాన అమ్మ మాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

హిమ్మత్‌నగర్‌లో..

జఫర్‌గఢ్: మండలంలోని కోనాయిచలం, టీబీతండా, హిమ్మత్‌నగర్ గ్రామాల్లో అమ్మమాట –అంగన్‌వాడీ బాట ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సుజాత, అనిత, అంగన్‌వాడీ టీచర్లు ఉపేంద్ర, గీతారాణి, మచ్చ శారద, విజయతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అష్టదళ పాద పద్మారాధన పూజ

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్తజనసందోహం నడుమ అష్టదళ పాద పద్మారాధన పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సిబ్బంది రమేశ్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మి, స్వరూప పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



కొడకండ్ల: గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారమే ధ్యేయంగా గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ తెలిపారు. మంగళవారం మొండ్రాయి గ్రామంలో నిర్వహించిన గ్రామసందర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ నాయకులు సోమనర్సయ్య, అంజయ్య, భిక్షపతి, అబ్దుల్లా, ఖలీం, రవిందర్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

తరిగొప్పుల: అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన మంచినీళ్ల నాగయ్య, వెంకవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను రెయిన్‌బో యూత్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం పరామర్శించి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అంకం రాజు, జొన్నగోని రాజు, బోగం అనూప్, అక్తర్ ఉన్నారు.

వాగుకు అడ్డుగా మొరం

పొలాలు నీట మునుగుతాయని రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులు

రఘునాథపల్లి: చెరువు నుంచి వరద ప్రవాహం దిగువకు సహజ సిద్ధంగా వెళ్లాల్సిన వాగుకు అడ్డుగా మొరం పోయడం వల్ల నాటేసిన పొలాలు నీట మునిగే ప్రమాదముందని ఫతేషాపూర్‌కు చెందిన పలువురు రైతులు ఆందోళన చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామ శివారులోని రోడ్డు డౌన్ వద్ద పొలాల మధ్య మొరం పోసిన చోట రైతులు ఆందోళన చేయగా వారికి మాజీ సర్పంచ్‌లు గాజులపాటి మహేందర్, ఎండీ హయతలీ, అక్కనపల్లి సత్యనారాయణలు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా బాధిత రైతులు లోడె నర్సయ్య తదితరులు మాట్లాడుతూ దశాబ్దాలుగా గ్రామంలోని తాళ్ల చెరువు నిండిన అనంతరం అలుగు పోస్తే పొలాల మీదుగా నీరు వెళ్తుంది. రియల్టర్‌కు భూమిని విక్రయించిన ఓ రైతు పొలాల కింద వాగుపై మీటరుకు పైగా ఎత్తులో మొరం పోయడంతో ప్రవాహానికి అడ్డుగా మారి నీరు నిలిచి పొలాలు మునిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి సమయంలో దొంగ చాటుగా మొరం పోస్తున్నారని వాపోయారు. వాగుపై మొరం పోస్తున్నారని ప్రభుత్వ విభాగాల అధికారులకు ఫిర్యాదు చేసి మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాగుకు అడ్డుగా మొరం పోసిన వారిపై తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని రైతులు కోరారు. ఆందోళనలో లోడె నర్సయ్య, హింగె మోహన్, గంగపురం ఉప్పలయ్య, గాజులపాటి వీరోజీ, అబ్బసాని నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

‘అధికారుల అండతోనే హెచ్చరిక బోర్డుల తొలగింపు’



జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ఆర్టీసీ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను అధికారుల అండతోనే కబ్జాదారులు తొలగించారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆర్టీసీ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు తొలగించిన ప్రదేశాన్ని నాయకులు, కార్యకర్తలు మంగళవారం సందర్శించి స్థలం కబ్జా కాకుండా రక్షించాలని నిరసన తెలిపారు. సుధాకర్, శ్రీను, యాదగిరి, నర్సింగం, ఎల్లయ్య, సాయిలు, ఎస్ యాకయ్య, సారంగం పాల్గొన్నారు.

స్థలాన్ని సందర్శించిన డిపో మేనేజర్

ఆర్టీసీ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డుల తొలగింపు విషయాన్ని తెలుసుకున్న వరంగల్–1 డిపో మేనేజర్ మోహన్‌రావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు, గ్రామస్తులు బస్టాండ్ స్థలంలో బోర్డులను తొలగించి స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇట్టి స్థలంలో వెంటనే ప్రహరీ నిర్మించి కబ్జాకు గురికాకుండా చూస్తామని డీఎం తెలిపారు. కాగా, బోర్డుల తొలగింపుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆర్టీసీ అధికారులు ఫిర్యాదు చేశారు.

బాధ్యతగా మొక్కలు నాటాలి


మొక్కలను పంపిణీ చేస్తున్న ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలను నాటి వాటిని పెంచాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ కార్యదర్శి గట్టు మంజుల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆర్డీఓ హాజరై మాట్లాడారు. వాతావరణ కాలుష్య నివారణకు మొక్కలను పెంచడమే సరైన మార్గమని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఆరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది దామెర రవి, స్వామి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గొర్రెల అపహరణ

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి శివారులో ఇద్దరు పెంపకం దారుల గొర్రెల అపహరణపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన మేకల అంజయ్య, పనికర శ్రీనులు దోనబండతండా శివారులో పాకలు వేసి గొర్రెలను పెంపుతున్నారు. ఈ నెల 14న అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు అంజయ్యకు చెందిన 13 గొర్రెలు, శ్రీనుకు చెందిన 8 గొర్రెలను అపహరించారు. బాధిత పెంపకం దారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ల బ్యాటరీల చోరీ

లింగాలఘణపురం: మండలంలోని బండ్లగూడెం, కళ్లెం, సిరిపురం గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద ఉన్న ట్రాక్టర్ల బ్యాటరీలను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితులు తెలిపారు. బండ్లగూడెంలో 3, కళ్లెంలో 3, సిరిపురంలో 3 చొప్పున 9 ట్రాక్టర్ల బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై ఎస్సై చింత రాజును వివరణ కోరగా ఫిర్యాదులు వచ్చాయని విచారణ జరుపుతున్నట్లు చెప్పారు.

భూ తగాదా కేసులో ఇద్దరి రిమాండ్

చిల్పూరు: భూ తగాదా కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రకుంటతండాకు చెందిన గుగులోత్ చాందినితో పాటు కుమారుడు రవి భూతగాదా విషయంలో భూక్య వీరన్నపై దాడి చేసి గాయపరిచారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి తీవ్ర గాయాలు


గాయపడిన క్షతగాత్రుడు

పాలకుర్తి: పిచ్చికుక్క దాడిలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని వావిలాల గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన సత్తూరు సంపత్, సోమక్క, అనపర్తి రామానుజం, గద్దల ఎల్లమ్మలు ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా వారిపై పిచికుక్క దాడి చేసి గాయపరిచింది. బాధితులు మంగళవారం పాలకుర్తి ప్రాథమిక ప్రభుత్వం ఆస్పత్రికి వెళ్లి యాంటీ రెబిస్ ఇంజక్షన్లను తీసుకున్నారు. రాత్రి వేళ కుక్క దాడితో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కాగా, గ్రామస్తులు పిచ్చి కుక్కను పట్టుకుని చంపి పాతి పెట్టారు.

నివాళి

దేవరుప్పుల: మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పసునూరి సంపత్ సుధాకర్ల తల్లి ఎల్లమ్మ మంగళవారం మృతి చెందింది. కాగా, కాంగ్రెస్ నాయకులు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు పంతం అచ్చయ్య, మహేందర్, సోమ నరసయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు చెన్నూరి రాంబాబు, పోతిరెడ్డి లీనారెడ్డి, భిక్షపతి, పంతం రవి, రమేష్, భాస్కర్, రాములు, శ్రీను గౌడ్ ఉన్నారు.

ఫొటో ఎక్స్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, ఫొటోగ్రాఫర్లు

నర్మెట: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఫొటో ఎక్స్ వాల్‌పోస్టర్‌ను తహసీల్దార్ ఎం.మహిపాల్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా అసోసియేషన్ మండల అధ్యక్షుడు వలబోజు రమేశ్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించే ఎగ్జిబిషన్‌కు మండలంలోని ఫొటోగ్రాఫర్లు హాజరు కావాలని, ఫొటోగ్రఫీలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందడుగు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వలబోజు శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఎక్కలదేవి జనార్దన్, నిమ్మ కృష్ణారెడ్డి, మండల గౌరవ అధ్యక్షుడు కొంపెల్లి భాస్కర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన జంగిటి స్వామి మృతి చెందాడు. కాగా, మంగళవారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంగిటి విద్యానాథ్ పరామర్శించి రూ. 5వేల సాయంతోపాటు 50 కిలోల బియ్యం అందజేశారు. మాజీ సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు పరిదె శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ప్రాణ రక్షణకు రక్తదానం చేయండి


రక్తదానం చేస్తున్న యువకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న తహసీల్దార్ యుగేందర్

రఘునాథపల్లి: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఆయువు పోసేందుకు ఆరోగ్యంగా ఉన్న యువత రక్తదానం చేయాలని రఘునాథపల్లి తహసీల్దార్ పురం యుగేందర్ సూచించారు. మంగళవారం మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు జన్మదినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 50 మందికి పైగా రాంబాబు యువసేన యువకులు రక్తదానం చేయడం పట్ల ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ బ్లడ్ సెంటర్ మెడికల్ అధికారిని మోర్తాల దివ్యతో కలిసి ధ్రువపత్రాలు అందజేశారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ఇతరులు రక్తదాన శిబిరాలు నిర్వహించడంపై ఆసక్తి చూపాలని తహసీల్దార్ సూచించారు. రక్తదానం శిబిరం ఏర్పాటు చేయించిన రాంబాబును తహసీల్దార్ అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ బొల్లం అజయ్, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు బ్రహ్మారెడ్డి, చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బెలిదె వెంకన్న, నాయకులు పోకల శివకుమార్, మేకల నరేందర్, నామాల బుచ్చయ్య, గాదె రమేశ్, మోర్తాల ప్రభాకర్, నీలం యువరాజ్, పెండ్లి మల్లారెడ్డి, గాదె మహేందర్‌రెడ్డి, పేర్ని రవి, లోనె శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో నీరు నిల్వకుండా చర్యలు


నీరు నిల్వకుండా మొరం పోయిస్తున్న మధుసూదన్

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలోని ఎస్సీకాలనీలో చిరుజల్లులు పడినా నీరు నిలుస్తుండటంతో కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలనీ చుట్టూ ప్రైవేట్ యజమానులు వారి స్థలాల్లో ప్రహరీలు నిర్మించుకోవడంతో వర్షాకాలంలో సమస్య ఏర్పడుతోంది. కాగా, మంగళవారం ఎంపీఓ మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి తౌటిరెడ్డి శివకుమార్ కాలనీని సందర్శించి నీరు నిల్వకుండా తాత్కాలికంగా మొరం పోయించారు. త్వరలో శాశ్వత పరిష్కారం చేయిస్తానని ఎంపీఓ తెలిపారు.

పరామర్శ

చిల్పూరు: నష్కల్ గ్రామానికి చెందిన జీపీ పంచాయతీ సఫాయి కార్మికుడు ఎర్రం వెంకటయ్య (80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 3వేలు సాయం అందజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు డాక్టర్ సాంబయ్య 50 కిలోల బియ్యం అందించారు. శిరీషసురేశ్, నర్సయ్య, స్వామి ఉన్నారు.

సామాజిక సేవలో రాములుయాదవ్

● ఐదేళ్లుగా పేదలకు చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న రాములుయాదవ్ (ఫైల్)

బచ్చన్నపేట: పుట్టిన ఊరులో పేదలకు తోడ్పాటు నందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు పోతుల రాములుయాదవ్. మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన రాములుయాదవ్ కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా 40 సంవత్సరాల క్రితం జీవనోపాధి కోసం ముంబాయికి వలస వెళ్లాడు. అక్కడ మేస్త్రీ పనులు చేస్తూ క్రమక్రమంగా కాంట్రాక్టర్‌గా మారి ఆర్థికంగా ఎదిగాడు. కాగా, సేవా కార్యక్రమాలు చేయాలనే దృక్పథంతో గ్రామానికి ఐదేళ్ల క్రితం తిరిగొచ్చాడు. ఇప్పటి వరకు గ్రామంలో నిరుపేదకుటుంబాల్లో 50 మంది మృతి చెందగా వారి అంత్యక్రియలకు ఆర్థికసాయం, 30 కుటుంబాలకు బియ్యం అందజేశాడు. కరోనా సమయంలో ఎందరికో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే జీపీ సిబ్బందికి బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు.

పేదరికం బాధ తెలుసు..



చిన్న తనంలో తను అనుభవించిన పేదరికం బాధ తెలుసు కనుకే పేదలకు ఆర్థిక తోడ్పాటును అందజేస్తున్నా. సంపాదించిన దాంట్లో కొంత భాగం దానం చేయాలన్నదే నా లక్ష్యం. పేదలకు మరిన్ని సేవలు అందిస్తా.

– పోతుల రాములుయాదవ్, పోచన్నపేట